# పాజిటివ్ థింకింగ్



'ఆంధ్రభూమి' వారపత్రిక . . . 27 మే, 2004

మేడపై కూర్చుని కథ రాస్తున్నాడు విహారి.

మధ్యలో ఆలోచిస్తూ తలెత్తి చూసిన అతనికి ఎదురింటి మేడపై 'ఆమె' కనిపించింది. చూస్తున్నకొద్దీ చూడాలనిపించే సౌందర్యం ఆమెది. ఈమధ్యనే విహారి ఎదురింట్లో చేరింది. ఆమె భర్తగాని, పిల్లలుగాని ఇంతవరకూ కనిపించలేదు అతనికి.

బట్టలు తీసుకొని వెళుతూ విహారి వైపు చూసిందామె.

చటుక్కున చూపులు మరల్చి ఏదో ఆలోచిస్తున్న వాడిలా ముఖం పెట్టాడు. ఆమె తనలో తానే నవ్వుకుంటూ మేడ దిగి క్రిందికి వెళ్లిపోయింది.

ఆమె ఎవరో, పేరేమిటో, ఆమె భర్త ఏం చేస్తాడో, ఆమెకు ఎంతమంది పిల్లలో తెలుసుకోవాలని అతనికి కుతూహలంగా ఉంది. రచయిత కావడంవల్ల అందరినీ నిశితంగా పరిశీలించడం, వివరాలు తెలుసుకోవడం అతని హాబీ. 'తన భార్య ఊర్లో ఉండివుంటే ఈపాటికి ఆవిడ వివరాలన్నీ తనకు తెలిసిపోయి ఉండేవి' అనుకున్నాడు.

మరుసటిరోజు సాయంత్రం ఆఫీసునుంచి రాగానే ముఖం కడుక్కుని, టవల్‌తో ముఖం తుడుచుకుంటూ హాల్లోకి వచ్చాడు. ఆమె హాల్లో నిలుచుని ఉంది.

"రండి... కూర్చోండి!" ఆహ్వానించాడు ఆమెని. తర్వాత లోపలికి వెళ్లి చొక్కా తొడుక్కుని వచ్చి ఆమె ఎదురుగా సోఫాలో కూర్చున్నాడు.

"నాపేరు సునందిని... మీ ఎదురింట్లో ఉంటున్నాను. మీరు రచయిత అని, విహారి పేరుతో కథలు రాసేది మీరేనని ఇక్కడివాళ్ళు చెప్పారు."

"అవును. విహారి నా పేరే... కలం పేరు కాదు."

"మీ కథలు చాలా చదివాను."

"ఎలా ఉంటాయి?"

"చాలా బాగా ఉంటాయి. మంచి ఇతివృత్తం, చక్కని డైలాగ్స్, అంతర్లీనంగా ఓ సందేశం, కలకాలం గుర్తుండేలా ఓ కొసమెరుపు... చాలా బాగా రాస్తారు."

"థాంక్యూ..."

"మేము ఆ ఇంటికి వచ్చి పది రోజులయింది. మీరు ఈమధ్య ఊరిలో ఉన్నట్లు లేదు."

"అవును. మా అత్తగారింటికి హైదరాబాద్ వెళ్లాము."

"మీ ఆవిడ?"

"ఆవిడ, పిల్లలు అక్కడే పదిరోజులుండి వస్తారు."

"అలాగా... మరి, నేను వస్తాను. మీరు రచయిత అని తెలిశాక పరిచయం చేసుకొని వెళ్దామని వచ్చాను."

"ఉండండి... కాఫీ తాగి వెళుదురు!"

"వద్దండీ..."

"ఫర్వాలేదు. మొదటిసారి ఇంటికి వచ్చిన అతిథికి కాఫీ అయినా ఇవ్వడం ధర్మం!" అంటూ కాఫీ చేసి కప్పుల్లో పోసి, ఆమెకొకటిచ్చి తనొకటి తీసుకున్నాడు.

గడియారం వంక చూస్తూ అంది సునందిని-

"రాముడు మంచిబాలుడులా ఆఫీసు కాగానే ఇంటికొచ్చేశారే!"

"నేను ఆఫీసులో ఉన్నంతసేపూ క్షణంకూడా వృథా చేయకుండా పనిచేస్తాను. ఆఫీసు టైము అయిపోయాక క్షణం కూడా ఉండను. ఎందుకంటే... ఉద్యోగిగానే కాక భర్తగా, తండ్రిగా కూడా నాకు బాధ్యతలున్నాయి కదా!"

"రచయిత అనిపించుకున్నారు!"

"రచయిత అనిపించుకోవడం కన్నా మనిషి అనిపించుకోవడమే నాకిష్టం!"

"మీవారేం చేస్తారు?" విహారి అడిగాడు.

"నా గురించి, మావారి గురించి చెప్పాలంటే ఓ పెద్ద కథవుతుంది. ఇంకోరోజు చెబుతాను."

"కథంటే నాకు ఆసక్తే... చెప్పండి!"

"ఇప్పుడు కాదు... ఇంకోసారి వచ్చినప్పుడు చెబుతాను. వస్తానండీ!" అంటూ వెళ్లిపోయింది.

●

"హలో... గుడ్ ఈవెనింగ్!"

"గుడ్ ఈవెనింగ్! రండి... ఈరోజు మీరొస్తారని నాకు అనిపించింది. నా ఊహ కరెక్ట్!"

ఆమె కూర్చోగానే విహారి లోపలికి వెళ్లడం చూసి-

"కాఫీ మీరు త్రాగండి... నేను ఇందాకే త్రాగాను" అంది సునందిని..

అతను లోపలికి వెళ్లి రెండు ప్లేట్లలో బొబ్బట్లు చెరి రెండు వేసుకొని తెచ్చాడు.

"ఎక్కడివి? కొన్నారా?"

"మా అత్తగారు చేశారు. చాలా బాగుంటాయి... తినండి. ఇందులోకి నెయ్యి వేసుకుంటారా? లేక, పాలు వేసుకుంటారా?"

"నెయ్యి వెయ్యండి!"

నెయ్యి బాటిల్ తెచ్చాడు విహారి.

"ఇటివ్వండి. నేను వేసుకుంటాను."

"అమ్మో... ఎక్కువ వేసేసుకుంటారు! నేనే వస్తాను" అంటూ నెయ్యి వేశాడు.

ఆమె నవ్వి, "చాలు... చాలు!" అంది కంగారుగా.

ఇద్దరూ మౌనంగా తినసాగారు.

"ఆఁ... ఇప్పుడు చెప్పండి మీ కథేమిటో!" ప్లేటులో చేయి కడుక్కుంటూ అన్నాడు విహారి.

సునందిని వాళ్ళిద్దరి ప్లేట్లూ లోపల సింక్‌లో వేసి చేయి కడుక్కొని వచ్చింది.

"మీరు మా అతిథి! మా ఇంట్లో ఇలాంటి పనులు చేయకూడదు మీరు!"

"ఫర్వాలేదు. ఇక కథ మొదలుపెడతాను. ప్రపంచంలో ఏ ఆడదీ నేను పడ్డ బాధలు పడి ఉండదు" అని, ఆమె మంచినీళ్లు త్రాగి చెప్పడం మొదలుపెట్టింది-

"మాది మధ్యతరగతి కుటుంబం! మా నాన్న గవర్నమెంటు ఉద్యోగి. నా చదువు పూర్తికాగానే స్టాటిస్టికల్ ఆఫీసరుగా పనిచేస్తున్న ఈయనతో పెళ్ళి కుదిరింది. ఆయన పేరు ప్రభాకర్. మా నాన్నగారు ఉన్నంతలో ఘనంగా నా పెళ్ళి చేశారు. అత్తగారింటికి ఖమ్మం వెళ్లాను. ఈయన వాళ్ళింట్లో పెద్దకొడుకు. ఆయన తర్వాత ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. అక్కడికి వెళ్లిన వారంరోజులకు

తెలిసింది- ఆయన ఒక శాడిస్ట్ అని! రాత్రి భోజనాలు కాగానే తన తమ్ముళ్ళ మధ్య పడుకొని నిద్రపోయేవారు. నేను గదిలో ఒంటరిగా పడుకొనేదాన్ని. నెలకు ఒక రోజో, రెండు రోజులో సంసార జీవితం గడిపేవాళ్ళం. వయసులో ఉన్న ఆడపిల్లకు- భర్త ఆ విధంగా ప్రవర్తిస్తే ఎలా ఉంటుందో ఓ రచయితగా మీరు అర్థంచేసుకోగలరనుకుంటాను..."

'నిజమే...' నన్నట్టు తలూపాడు విహారి.

"నా కడుపున ఒక కాయ కాయకపోవడం వల్ల మా అత్తగారు ఆయనకు రెండోపెళ్ళి ప్రయత్నాలు మొదలుపెట్టారు. నేను వద్దని, ఆ ప్రయత్నం మానుకోమని బ్రతిమాలాను, ఏడ్చాను, చచ్చిపోతానని బెదిరించాను. వాళ్ళు బెదరలేదు. డాక్టరు దగ్గరకెళ్ళి లోపం ఎవరిలో ఉందో తెలుసుకుందామన్నాను. ఆయన విని ఊరుకున్నాడు. ఆయనకు రెండోపెళ్ళి జరిగింది. నా ఎదురుగానే మరో ఆడదానికి తాళి కట్టాడు!" అంటూ ఏడవసాగింది.

"ప్లీజ్... బాధపడకండి!" విహారి ఓదార్పుగా అన్నాడు.

"సంవత్సరం తర్వాత నాకు మగపిల్లవాడు పుట్టాడు. ఆయన రెండోభార్యకు పిల్లలు పుట్టలేదు. ఆమె నన్ను సాధించడం మొదలుపెట్టింది. నేనూ ఎదురుతిరిగాను. మా ఇద్దరి గొడవలు తీర్చలేక ఆయన నన్ను తీసుకొచ్చి వరంగల్‌లో కాపురం పెట్టాడు. మా అబ్బాయిని నాతో పంపడానికి మా అత్తగారు ఒప్పుకోలేదు. ఆయన నెలకు రెండుసార్లు వచ్చి నాతో ఉంటారు. మా అబ్బాయిని కూడా ఆయనతోపాటే పిలుచుకొని వస్తారు. ఇదీ... నా కథ!"

"మీ బాధను నేను అర్థంచేసుకోగలను. కానీ, ఇందాక ప్రపంచంలో ఏ ఆడదీ మీలా బాధలు పడి ఉండదు- అన్నారు. మీరు పరిశీలిస్తే ప్రపంచంలో ఇంతకంటే బాధలు పడే అమ్మాయిలు చాలామంది ఉన్నారు. భర్త వదిలేసి, భర్తను కోల్పోయి, జీవనాధారం లేక, పిల్లల్ని పెంచలేక సతమతమయ్యే స్త్రీలు చాలామంది ఉన్నారు. ఇంకా శారీరకంగా వికలాంగులైన వారు, ఎయిడ్స్, క్యాన్సర్ లాంటి రోగాలతో బాధపడేవారు... వీళ్ళందరి కంటే మీరు సుఖంగా లేరూ? మీకు కనీసం తినడానికి, ఉండటానికి ఇబ్బంది లేకుండా చేశారు మీ భర్త. పైగా- మీరు చదువుకున్నారు కనుక ఒకవేళ మీ భర్త మిమ్మల్ని పోషించడం మానేసినా, లేదా మీరే విడాకులు తీసుకున్నా ఏదో ఒక ఉద్యోగం చేసుకొని బ్రతగ్గలరు. మీ అబ్బాయిని వాళ్ళకు నచ్చచెప్పో, లేదా కోర్టు ద్వారా మీరు తెచ్చుకొని, అతన్ని బాగా చదివించి, మంచి వ్యక్తిగా తీర్చదిద్దాలనే ఆశయం కోసం మీరు శ్రమించవచ్చు."

"అది అంత సులభం కాదు."

"సులభం అని నేనూ అనను... అసాధ్యం మాత్రం కాదు."

టైము చూసి, "పాలవాడు వచ్చే వేళయింది... నేను వెళ్ళొస్తాను" అంది సునందిని.

"మీరు ధైర్యంగా ఉండండి. మీ సమస్యను సృష్టించిన ఆ భగవంతుడే పరిష్కారం కూడా చూపిస్తాడు" అన్నాడు విహారి.

●

"నిన్న మీతో నా కథంతా చెప్పుకున్నాక నాకొక ఆలోచన వచ్చింది!" - అంది సునందిని విహారితో.

"ఏమిటది?"

"వింటే... నన్ను అసహ్యించుకుంటారు."

"అసహ్యించుకోను... చెప్పండి!"

"మా ఆయన నెలకు రెండురోజులు మాత్రమే నాతో ఉండి, మిగతా నెలంతా తన రెండోభార్య దగ్గర ఉంటారు కదా... ఆ పని నేను కూడా చేస్తే..?!"

ఒక్కక్షణం ఆమె చెప్పింది అర్థంకాలేదు అతనికి. అర్థమయ్యాక ఆశ్చర్యంతో కనుబొమలు వెడల్పు చేసి చూశాడామె వైపు.

"చెప్పండి. మీరు రచయిత కదా... నా ఆలోచన తప్పా?"

"రచయితగానే కాదు- ఓ మనిషిగా కూడా తప్పనే అంటాను. మీ బాధలకు పరిష్కారం విడాకులు, పునర్వివాహం!"

"కోర్టుకంటూ వెళ్లాక అది నెలలే పడుతుందో, సంవత్సరాలే పడుతుందో తెలియదు. ఈలోపల నాకు వయసు మళ్లి నన్ను చేసుకోవడానికి ఎవరూ ముందుకు రారు" అంది నవ్వుతూ.

"విడాకుల కేసులు నాకు తెలిసి అంత ఎక్కువ కాలం నడవవు. త్వరగానే పరిష్కరిస్తారు."

"పరిష్కారం నేనే చూసుకున్నాన్లెండి! అవునూ... ఈరోజు ఇంటికి ఇంత ఆలస్యంగా వచ్చారేం..?"

"మీటింగ్ ఉంది ఆఫీసులో. ఏం... ఎందుకలా అడిగారు?"

"మీరు గంట ఆలస్యంగా ఇంటికి వచ్చేసరికి నా మనసు ఆ ఆలస్యాన్ని భరించలేకపోతోంది. ఐ లవ్ యూ విహారిగారూ! నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నానన్న విషయం ఈరోజే నాకు తెలిసింది."

నిశ్చేష్టుడై నిలబడిపోయాడు విహారి.

"చెప్పండి... నా ప్రేమను స్వీకరిస్తారా?"

"అది ప్రేమ కాదు. మీ బాధల్ని ఓపికగా విని సలహాలు ఇచ్చినందుకు నాపై మీకు కలిగిన అభిమానం!"

"పోనీ, అభిమానమే అనుకుందాం... మీ అభిమానానికి నేను అర్హురాలినా?"

"ఎందుకు కాదు? మీరు నా స్నేహితురాలు... మీరంటే నాకూ ఇష్టం!"

"థాంక్యూ... వస్తాను."

"రేపటి నుంచి వారంరోజులు హైదరాబాదులో ట్రైనింగ్ ఉంది నాకు. రేపు ఉదయం బయలుదేరుతున్నాను."

ఆమె నీరసంగా అతనివైపు చూసి, అంతలోనే నవ్వేస్తూ...

"ఆల్ ది బెస్ట్... హేవ్ ఎ నైస్ టైమ్! మీ ఆవిడని అడిగినట్లు చెప్పండి!" అంది.

●

ట్రైనింగ్ అయ్యాక వరంగల్ తిరిగొచ్చిన విహారిని చూడగానే- సునందిని తన ఇంట్లోనుంచే చెయ్యి ఊపింది సంతోషంగా.

సాయంత్రం వచ్చి, "ఎలా ఉంది ట్రైనింగ్..?" అని అడిగింది.

"చాలా ఉపయోగకరంగా ఉంది. మీరెలా ఉన్నారు?"

"బాగున్నాను. మీ కోసమే ఎదురుచూస్తున్నాను."

ఇబ్బందిగా చూశాడు ఆమె వైపు.

"రేపు నా పుట్టినరోజు!" అంది సునందిని.

"అలాగా..! అడ్వాన్స్‌గా పుట్టినరోజు శుభాకాంక్షలు అందుకోండి!"

"థాంక్యూ! రేపు రాత్రి మా ఇంటికి భోజనానికి రావాలి మీరు!"

"భోజనానికి ఎందుకండీ! సాయంత్రం వస్తాను... మంచి కాఫీ ఇవ్వండి చాలు!"

"ఫర్వాలేదు. మీరు భోజనానికే రావాలి. గిఫ్ట్ లేవీ తీసుకురాకండి. మీరే ఒక గిఫ్ట్ నాకు!"

"నాతో ఫ్రెండ్‌షిప్ ఒక గిఫ్ట్ అనండి. నేనూ మీతో స్నేహం గురించి అలాగే ఫీలవుతున్నాను."

మరుసటిరోజు రాత్రి ఏడున్నరకి సునందిని ఇంటికి వెళ్లాడు విహారి.

"మెనీ హ్యాపీ రిటర్న్ ఆఫ్ ది డే!" గిఫ్ట్ ప్యాకెట్ ఆమె చేతిలో పెడుతూ అన్నాడు.

"థాంక్యూ..."

తర్వాత విహారికి ఇల్లు చూపించింది. "ఎలా ఉంది మా ఇల్లు..?" అడిగింది ఆ తర్వాత.

"మీలా అందంగా, నాజూకుగా ఉంది."

"ఇది మా బెడ్‌రూమ్! రండి... లోపలికి!"

"ఫర్వాలేదు. చూశానుగా... చాలా కళాత్మకంగా తీర్చిదిద్దారు!"

"ఫర్వాలేదు. రండి... లోపలికి! ఇంగ్లీషులో ఒక సేయింగ్ ఉంది- 'యు కెన్ బై ఎ హౌస్- బట్ నాట్ ఏ హోమ్!' అనే సేయింగ్ మా బెడ్‌రూమ్‌కీ వర్తిస్తుంది."

ఆమె భావం అర్థమైనట్లు తల ఊపాడు మౌనంగా.

"విహారిగారూ! మీరు అందరికీ సలహాలిస్తూ సహాయం చేస్తుంటారని విన్నాను. నాకు ఒక్క సహాయం చేయలేరా?"

ఏమిటన్నట్టు చూశాడు.

"నాతో ఈ ఒక్కరాత్రి గడపండి... చాలు! నేను ఇంకేమీ కోరను. మళ్లీ మళ్లీ కూడా కోరను. ఈ ఒక్కరోజు, ఒక్కరాత్రి! మీరు నాకిచ్చే పుట్టినరోజు గిఫ్ట్ ఇదే!"

అతను ఏమీ మాట్లాడకుండా ఆలోచిస్తున్నట్టు నిలబడి ఉన్నాడు.

"చెప్పండి... నా కోరిక తీర్చరా ప్లీజ్!"

అతను తల పంకించి, "అలాగే..." అన్నాడు.

"నిజంగా..?" ఆశ్చర్యంగా అడిగింది.

"నిజంగానే చెబుతున్నాను. నిజానికి నాకు ఇలాంటివి ఇష్టం ఉండదు. నా స్నేహితురాలైన మీ కోరిక తీర్చడం నా ధర్మం!"

"ముందు భోంచేద్దామా? లేక..?"

"మీ యిష్టం!" మంచం మీద కూర్చుంటూ అన్నాడు.

ఆమె కదలకుండా అతన్నే చూస్తూ నవ్వుతోంది.

ఏమిటన్నట్టు చూశాడు.

"శభాష్ రచయితగారూ!" మెల్లగా చప్పట్లు కొడుతూ... "ఈ మాట మీచేత అనిపించడం కోసమే ఇన్ని ప్రయత్నాలు చేశాను, ఇన్ని కథలు చెప్పాను. నైతికత గురించి, క్రమశిక్షణ గురించి

ఎన్నో కథలు, నవలలు రాసిన మీరు- ఈరోజు ఓ పరాయి ఆడదాన్ని పొందాలని చూశారు. మీరు అందరికీ చెప్పేవి శ్రీరంగనీతులు. కానీ, చేసేవి మాత్రం శృంగారకేళీలు!" అంది సునందిని.

"అంటే... ఇదంతా నాటకమా?" ఆశ్చర్యంగా చూస్తూ మంచం పైనుంచి లేచాడు విహారి.

"అవును. నా భర్త శాడిస్టనీ, రెండోపెళ్ళి చేసుకున్నాడనీ అబద్ధం చెప్పాను. నిజానికి ఆయన బంగారం! నా కొడుకు రిషివాలీ స్కూల్‌లో చదువుతున్నాడు. నాకు ఏ బాధలూ లేవు. మేము ఇక్కడికి వచ్చాక అందరూ మీ గురించి, మీ మంచితనం గురించి, మీ రచనల గురించి గొప్పగా చెబుతూంటే విని మీ మంచితనం ఏపాటిదో తెలుసుకుందామని ఈ నాటకం ఆడాను. వెళ్లండి... ముందు మీరు మంచిగా మారండి, నైతికత పాటించండి! ఆ తర్వాతే అందరికీ మీ కథల ద్వారా చెప్పండి... వెళ్లండి!"

విహారి తల వంచుకొని తలుపు వైపు నడిచాడు.

"హలో... ఒక్క మాట! మీరు చేయబోయిన ఘనకార్యం గురించి మీ భార్యకు చెప్పి మీ కాపురంలో కలతలు రేపగలను. ఇరుగుపొరుగు వాళ్ళకు చెప్పి మిమ్మల్ని తలదించుకొనేలా చేయగలను. కానీ, నాకు అలా చేయాలని అనిపించడం లేదు. నాలో దయ, క్షమాగుణం ఉన్నాయి."

●

"మీరు సునందిని ఇంటికి వెళ్లారా?"

- ఊరి నుంచి వచ్చిన మరునాడే విహారిని అతని భార్య శోభ అడిగింది.

"అవును. పుట్టిన రోజని పిలిచింది. నీకెవరు చెప్పారు?"

"ఆవిడే చెప్పింది. మీరు ఆమెతో అమర్యాదగా ప్రవర్తించబోయారని చెప్పింది."

"నువ్వు నమ్మావా?"

"లేదు. ఇంతకీ... ఏం జరిగింది?"

విహారి జరిగింది చెప్పాడు.

●

"ఏమిటి..?" విహారి తన ఇంట్లోకి రావడం చూసి సునందిని అడిగింది.

"మీరు మాట తప్పారు!"

"ఏ విషయంలో..?"

"మీతో నా ప్రవర్తన గురించి ఎవరికీ చెప్పనని నాతో చెప్పి, నా భార్య ఊరినుండి రాగానే ఆమెతో చెప్పేశారు."

"నేను మాట మాత్రమే తప్పాను... మీరు దారి కూడా తప్పారు. ఆ విషయం మీ ఆవిడకే కాదు- మన చుట్టుపక్కల ఇళ్లలో ఉన్నవారందరికీ చెప్పాను."

"ఇక్కడ ఉన్నవాళ్ళందరికీ నా గురించి, నా ప్రవర్తన గురించి తెలుసు. అందుకే నా భార్య ఊర్లోలేని సమయంలో మీరు పదేపదే మా ఇంటికి వచ్చి కబుర్లు చెబుతున్నా వాళ్ళు ఆశ్చర్యంగా చూడటంగానీ, మా ఆవిడ ఊర్నుంచి రాగానే ఆమెతో చెప్పడంగానీ చెయ్యలేదు. తెలిసిన ఆడవాళ్ళుగాని, మగవాళ్ళుగాని వచ్చి నాతో తమ సమస్యల్ని చెప్పుకొని సలహా కోరడం వాళ్ళు

తరచుగా చూస్తుంటారు. వాళ్ళందరూ నన్ను ఓ అన్నలా భావిస్తారు. కాబట్టి నా గురించి వాళ్ళకేం చెప్పినా విని మనసులో నవ్వుకుంటారు. ఇక- మీ విషయానికి వస్తే... మీ సంసారం గురించి మీరు చెప్పినదంతా అబద్ధమని నాకు అనుమానం రాలేదు. నిజమనే నమ్మి మీ పరిస్థితికి బాధపడ్డాను. 'ఏం చేసి మీ కాపురంలో సుఖశాంతులు తేగలనా?' అని రాత్రీపగలు ఆలోచించాను. హఠాత్తుగా ఒకరోజు 'నన్ను ప్రేమిస్తున్నా'నంటూ నాలో ఆందోళనని రేకెత్తించారు.

మీ మనసుని మార్చి, ఎలా మంచిదారిలో పెట్టాలా... అని ఆలోచించాను. ఇంతలో... నేను హైదరాబాదుకు ట్రైనింగ్ కోసం వెళ్లాల్సి వచ్చింది. ఆ ట్రైనింగ్‌లో మాకు ఆఫీసు విషయాలతో పాటు వ్యక్తిత్వ వికాసం గురించి, పాజిటివ్ థింకింగ్ గురించి సైకాలజిస్టులు క్లాసులు తీసుకుంటారు. ఆరోజు క్లాసులో ఏం జరిగిందో మీకు చెబుతాను..."

●

సైకాలజిస్టు శ్రీహరిరావు చెబుతున్నది ఏకాగ్రతతో వింటున్నాడు విహారి.

"మనలోని ఈర్ష్యను మనమే ప్రయత్నించి దూరం చేసుకోవాలి. మితిమీరిన ఈర్ష్య మానసిక రుగ్మత క్రిందకు వచ్చినా మనిషిలో ఈర్ష్య కొద్దిగా ఉంటేనే మంచిది. దానివల్ల మీలో కాంపిటేటివ్ స్పిరిట్ పెరుగుతుంది.

అయితే ఈర్ష్య పెరిగేకొద్దీ మీలో అసహనం పెరిగి మనశ్శాంతి కరువవుతుంది. దీన్ని మీరు హిప్నాటిజం ద్వారా దూరం చేసుకోవచ్చు. ఈమధ్య వరంగల్ నుంచి ఒకతను వచ్చాడు. అతను కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి. అందమైన భార్య, కొడుకు ఉన్నారు. అయితే భార్యతో ఒక చిన్న ప్రాబ్లెమ్! అతని భార్యకి రచయిత్రి కావాలని కోరికగా ఉండేది. ఎన్నో కథలు రాసి పత్రికలకు పంపింది. ఒక్క కథ కూడా ప్రచురణకు నోచుకోలేదు. ఆ డిసప్పాయింట్‌మెంట్ వల్ల- రచనలు పత్రికలలో పడుతున్న రచయితలంటే ఆమెకి ఈర్ష్య, ద్వేషం ఏర్పడ్డాయి.

అతనికి కథలన్నా, నవలలన్నా చాలా యిష్టం! అతను ఇంటికి తెచ్చిన ప్రతి పుస్తకాన్ని చదివి, అందులోని కథల్ని చదివి తప్పుల్ని వెతికేది. ఏ కథా బాగాలేదని విమర్శించేది. ఈమధ్య వాళ్ళు కొత్తగా ఇల్లు మారారు.

ఇప్పుడు వాళ్ళ ఎదురింట్లో ఓ పేరున్న రచయిత ఉంటున్నాడు. అది ఆమెలోని అశాంతిని మరింత పెంచింది. ఆమెలో పెరుగుతున్న నెగెటివ్ థింకింగ్‌కి భయపడి అతను నా దగ్గరికి వచ్చి సలహా అడిగాడు.

ఆవిడని ఒకసారి నా దగ్గరకి పిలుచుకొని రమ్మన్నాను. తర్వాత అతను రాలేదు. బహుశా ఆవిడ ఒప్పుకొని ఉండదు. అటువంటి ఈర్ష్య వల్ల అశాంతే తప్ప సుఖం ఉండదు.

అంతేకాదు- వాళ్ళ చుట్టూ ఉన్నవాళ్ళను కూడా ఇబ్బందికి గురిచేస్తారు. తమలో ఈర్ష్య పోవాలని వాళ్ళంతట వాళ్ళు ముందుకొస్తే హిప్నాటిజం ద్వారా వాళ్ళలోని ఈర్ష్యను తరిమేయడం సాధ్యమే!"

క్లాసు అయ్యాక... విహారి ఆ సైకలాజిస్ట్‌ని సమీపించి, "మీరు ఇందాక చెప్పిన వరంగల్ దంపతుల పేర్లు ప్రభాకర్, సునందిని కాదు కదా..?" అన్నాడు.

అతను ఆశ్చర్యంగా చూస్తూ... "వాళ్ళే! మీకెలా తెలుసు?" అన్నాడు.

"వారి ఎదురింట్లోని రచయితని నేనే... నా పేరు విహారి!"

"విహారి అంటే మీరేనా? యు ఆర్ గ్రేట్! మీ రచనల్ని చదివాను నేను. మీతో పరిచయం కావడం నా అదృష్టం!"

●

"ఆయనతో మాట్లాడాక మీ ఆలోచన నాకు అర్థం అయింది. మీరు నన్ను పరీక్షిస్తున్నారని తెలిసింది. నాకు మీపై కోపం రాలేదు... జాలి కలిగింది. మీ మనసు మార్చడానికి నేను సైకియాట్రిస్ట్‌ని కాను, సైకాలజిస్ట్‌నీ కాను. కాని, సైకాలజిస్ట్ సలహాపై నేనూ మీవైపు ఆకర్షితుడైనట్లు నటించాను. నేను రాతల్లో చూపినంత మంచివాడిని కానని తెలిస్తే మీలో అలజడి, అశాంతి కొంతైనా తగ్గుతుందని భావించాను. పేషెంట్ రోజూ పథ్యం తింటూ ఓరోజు తన కిష్టమైనవి తింటానంటే ప్రమాదం లేదని భావిస్తే, డాక్టరు తినమంటాడు చూడండీ... అలాంటిదే నేను చేసింది!

మీ పుట్టినరోజు నాడు మీ ఇంటికి వచ్చి మీ ఇల్లు చూడగానే మీది ఆనందమైన సంసారం అని తెలిసింది. మీ సంసారం మీరు అల్లిన కథలోలా ఉండివుంటే మీ ఇల్లు అంత అందంగా ఉండేది కాదు. నిరాశా, నిస్పృహలతో ఉండివుంటే మీరు ఇంటిని అంత కళాత్మకంగా తీర్చిదిద్దేవారు కాదు. నిజంగా నాలో దురుద్దేశమే ఉంటే మీ బెడ్‌రూమ్ వరకూ వచ్చిన నేను- ఆ ఎ.సి. రూములో మిమ్మల్నేం చేసినా మీ అరుపులు బయటకు వినిపించవు కాబట్టి ఆ అవకాశాన్ని వినియోగించుకొనే వాడినా? కానా? ...ఆలోచించండి!

మీరు నన్ను పరీక్షింపబోయారు కానీ, దానివల్ల ఓ స్నేహితుణ్ణి దూరం చేసుకుంటున్నాననే ఆలోచన మీకు రాలేదు. మీ కథంతా ఓపికగా విని నాకు తోచిన సలహాలిస్తుంటే... ఇంకో మనిషైతే 'అయ్యో... ఇతన్ని మోసం చేస్తున్నానే!' అన్న గిల్టీఫీలింగ్ కలిగి నిజం చెప్పేసేవారు.

మీకు అలా అనిపించకపోవడం దురదృష్టకరం. అన్నిటినీమించి- భోజనానికి పిలిచిన మనిషిని భోజనం పెట్టకుండా వెళ్లగొట్టారు. మీలోని నెగెటివ్ మెంటాలిటీకి పరాకాష్ట అది!

మీరు మన మధ్య జరిగింది ఎవరికీ చెప్పనని అన్నారు. కానీ, మాట మీద నిలబడలేదు. ఈర్ష్యాద్వేషాలు మనసు నిండా పెట్టుకున్న మీకు- స్నేహం విలువ తెలియని మీకు- మాట మీద నిలబడటం తెలియని మీకు- ఇంటికి భోజనానికి వచ్చిన అతిథికి భోజనం పెట్టకుండా వెళ్లగొట్టిన మీకు- నన్ను పరీక్షించే అర్హత ఉందా? ...అని ఒకసారి ఆలోచించండి.

మీలో పాజిటివ్ థింకింగ్ ఉండివుంటే నా స్నేహాన్ని మీకు ప్రయోజనకరంగా మలచుకుని ఉండేవారు. మీరు రాసిన కథల్ని నాకు చూపి, నా సలహాలను తీసుకొని పత్రికలకు పంపించి ఉంటే మీ కథలు ప్రచురింపబడి ఉండేవి. మంచికథలు రాయాలంటే రాసే నేర్పు ఒకటే చాలదు... మనలో మంచితనం ఉండాలి. మనసులో కల్మషం పెట్టుకొని మనమెంత మంచి రాసినా అది అతికినట్టుండదు.

నేను ఆశావాదిని. మీరు ఇకపై పాజిటివ్‌గా ఆలోచిస్తారని, మీరు మారి మళ్లీ మాతో కలుస్తారని, మన స్నేహం కొనసాగుతుందని నేను ఆశిస్తున్నాను" అని వెళ్లిపోయాడు విహారి.